పిల్లి హెయిర్ కటింగ్‌కు రూ. 55 వేలు

వసీం అక్రమ్‌కు వింత అనుభవం

సిడ్నీ: పాకిస్థాన్ దిగ్గజ పేసర్ వసీం అక్రమ్‌కు వింత అనుభవం ఎదురైంది. ఆయన ఎంతో ఇష్టంగా పెంచుకునే పిల్లికి కటింగ్ చేయించేందుకని ఆస్ట్రేలియాలో ఓ షాప్‌నకు వెళ్లగా అక్కడ బిల్లు చూసి అక్రమ్ అవాక్కవ్వక తప్పలేదు. పాకిస్థాన్, ఆస్ట్రేలియా మధ్య ఇటీవలే ముగిసిన వన్డే సిరీస్‌లో భాగంగా కామెంట్రీ విధులు నిర్వర్తిస్తుండగా అక్రమ్ మాట్లాడుతూ.. 'నేను నిన్న నా పిల్లికి హెయిర్ కట్ చేయించేందుకు వెళ్లాను. అందుకోసం వాళ్లు ఒక వెయ్యి ఆస్ట్రేలియన్ డాలర్లు చార్జ్ చేశారు. ఇదే పాకిస్థాన్‌లో అయితే 200 పిల్లులను కొనుక్కోవచ్చు' అని చెప్పిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

చాంపియన్స్ ట్రోఫీపై సందిగ్ధత

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీ-2025 నిర్వహణపై నెలకొన్న సందిగ్ధతకు ఇంకా తెరపడటం లేదు. భద్రతా కారణాల దృష్ట్యా తాము పాకిస్థాన్‌లో పర్యటించలేమని బీసీసీఐ పేర్కొన్న నేపథ్యంలో ఐసీసీ సంప్రదింపులకు దిగింది. హైబ్రిడ్ పద్ధతిలో టోర్నీని నిర్వహించలేమన్న పీసీబీ ప్రకటనతో ఐసీసీ తీసుకునే చర్యలపై ఆసక్తి నెలకొన్నది. పాక్ నుంచి పూర్తిగా తప్పిస్తూ దక్షిణాఫ్రికాలో టోర్నీ నిర్వహించే అవకాశముందని వార్తలు వచ్చాయి.

తొలి రౌండ్‌లోనే ఇంటిబాట

కుమమొటొ(జపాన్): భారత డబుల్స్ బ్యాడ్మింటన్ ద్వయం త్రిసా జాలీ-గాయత్రి గోపీచంద్.. కుమమొటొ మాస్టర్స్ తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టారు. మంగళవారం జరిగిన మహిళల డబుల్స్ రౌండ్ ఆఫ్-32లో త్రిసా-గాయత్రి జంట.. 16-21, 16-21తో హు యిన్ హుయ్ - లిన్ యిన్ హుయ్ (చైనీస్ తైపీ) చేతిలో ఓటమిపాలయ్యారు. ప్రత్యర్థి జోరుతో భారత ద్వయం ఆట 36 నిమిషాల్లోనే ముగిసింది. ఈ టోర్నీలో బుధవారం స్టార్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్యసేన్ బరిలోకి దిగనున్నారు.

బ్యాటర్లు రాణిస్తేనే..!

ఆందోళన రేపుతున్న అభిషేక్ ఫామ్ • మిడిలార్డర్ గాడిన పడేనా? • నేడు భారత్, దక్షిణాఫ్రికా మూడో టీ20

సెంచూరియన్: దక్షిణాఫ్రికా పర్యటనలో నాలుగు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడేందుకు వెళ్లిన యువ భారత్.. బుధవారం ఆతిథ్య జట్టుతో మరో కీలక పోరులో తలపడనుంది. సిరీస్‌లో ఇరుజట్లు ఇది వరకే తలా ఓ మ్యాచ్ గెలవగా నేడు సెంచూరియన్ వేదికగా మూడో టీ20 జరుగనుంది. డర్బన్‌లో ఆల్‌రౌండ్ ఆట తీరుతో అదరగొట్టినా రెండో మ్యాచ్‌లో బ్యాటింగ్ వైఫల్యం 'మెన్ ఇన్ బ్లూ'ను దారుణంగా దెబ్బతీసింది. స్పిన్నర్ల పుణ్యమా అని ఆ మ్యాచ్‌లో గెలిచే అవకాశాలను సృష్టించుకున్నప్పటికీ ఆఖర్లో పేసర్లు గాడితప్పి మ్యాచ్‌ను సఫారీలకు అప్పగించారు. కాగా బుధవారం మ్యాచ్‌లో గెలిచిన జట్టుకు సిరీస్‌పై పట్టు సాధించే అవకాశం చిక్కనున్న నేపథ్యంలో పోరు ఆసక్తికరంగా సాగనుంది.

అభికి ఆఖరి అవకాశం?

టాపార్డర్‌లో యువ ఓపెనర్ అభిషేక్ శర్మ వైఫల్యం భారత్‌ను ఆందోళనకు గురిచేస్తోంది. ఆడిన 9 మ్యాచ్‌లలో జింబాబ్వేతో సెంచరీ మినహా గత 7 ఇన్నింగ్స్ (10, 14, 16, 15, 4, 7, 4)లలో అతడు కనీసం 20 పరుగుల మార్కునూ అందుకోలేదు. ఆది నుంచే ఎదురుదాడికి దిగాలనే వ్యూహంతో అతడు చెత్త షాట్లు ఆడి ఆరంభంలోనే పెవిలియన్‌కు చేరుతున్నాడు. సెంచూరియన్ మ్యాచ్ అతడికి చావో రేవో అన్నవిధంగా తయారైన నేపథ్యంలో అభిషేక్ ఎలా ఆడతాడనేది చూడాలి. ఒకవేళ అతడిని పక్కనబెడితే రమణ్‌దీప్ సింగ్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశాలున్నట్టు జట్టు మేనేజ్‌మెంట్ వర్గాల సమాచారం. ఇక డర్బన్‌లో ఓపెనర్ సంజూ శాంసన్ సెంచరీతో సత్తా చాటినా రెండో మ్యాచ్‌లో మాత్రం డకౌట్ అయి నిరాశపరిచాడు. బుధవారం నాటి పోరులో అతడి నుంచి అభిమానులు మరో ధనాధన్ ఇన్నింగ్స్ ఆశిస్తున్నారు. సారథి సూర్యకుమార్ యాదవ్ ఈ సిరీస్‌లో తన మార్కును చూపించలేకపోయాడు. మిడిలార్డర్‌లో తిలక్ వర్మ గత రెండు మ్యాచ్‌లలో ఫర్వాలేదనిపించినా రింకూ సింగ్ తేలిపోతున్నాడు. హార్దిక్ పాండ్యా రెండో టీ20లో టాప్ స్కోరర్‌గా నిలిచినా అతడు చేసిన పరుగుల కంటే ఆడిన బంతులే ఎక్కువ.

నిలకడ లేని పేసర్లు..

గత రెండు మ్యాచ్‌లలో భారత్‌కు పేసర్ల కంటే స్పిన్నర్లు మెరుగైన ప్రదర్శన చేశారు. ముఖ్యంగా మూడేండ్ల తర్వాత జట్టులోకి వచ్చిన వరుణ్ చక్రవర్తి అంచనాలకు మించి రాణిస్తున్నాడు. రవి బిష్ణోయ్ సైతం అతడికి అండగా నిలుస్తున్నాడు. కానీ అర్ష్‌దీప్, అవేశ్ మాత్రం వికెట్ల వేటలో వెనుకబడుతున్నారు. రెండో టీ20లో గెలుపు అంచుల దాకా వచ్చిన భారత్ ఓడటానికి పేసర్లూ ఓ కారణమన్నది తెలిసిందే. సెంచూరియన్‌లో అయినా పేస్ ద్వయం రాణించాలని భారత్ ఆశిస్తోంది.

సీనియర్ల వైఫల్యం

ఈ సిరీస్‌లో దక్షిణాఫ్రికా సీనియర్లు వరుస మ్యాచ్‌లలో విఫలమవుతుండటం ఆ జట్టును ఆందోళనకు గురిచేస్తోంది. సారథి ఎయిడెన్ మార్క్‌రమ్, డేవిడ్ మిల్లర్, హెన్రిచ్ క్లాసెన్ వంటి భారీ హిట్టర్లు ఇంతవరకూ తమ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. ట్రిస్టన్ స్టబ్స్, గెరాల్డ్ కొయెట్జీ పోరాటంతో రెండో టీ20లో ఆ జట్టు గట్టెక్కింది. కొయెట్జీ గత రెండు టీ20లలో బంతితో పాటు బ్యాట్‌తోనూ సత్తా చాటగా ఆల్‌రౌండర్ జాన్సెన్ మాత్రం బంతితో ఫర్వాలేదనిపించినా బ్యాట్‌తో విఫలమవుతున్నాడు. కీలక పోరులో సఫారీ బ్యాటర్లు జూలు విదిల్చితే భారత్‌కు కష్టాలు తప్పకపోవచ్చు.

తుది జట్లు (అంచనా)

భారత్: శాంసన్, అభిషేక్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్, హార్దిక్, రింకూ, అక్షర్, అర్ష్‌దీప్, వరుణ్, బిష్ణోయ్, అవేశ్

దక్షిణాఫ్రికా: మార్క్‌రమ్ (కెప్టెన్), రికెల్టన్, స్టబ్స్, క్లాసెన్, మిల్లర్, క్రుగర్, జాన్సెన్, సిమెలానె, కొయెట్జీ, కేశవ్, పీటర్

భారత్‌కు రెండో విజయం

రాజ్‌గిర్ (బీహార్): మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ (ఏసీటీ)లో భారత హాకీ జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. మంగళవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో 3-2తో దక్షిణ కొరియాపై గెలిచింది. భారత్ తరపున సంగీతా కుమారి 3వ నిమిషంలోనే తొలి గోల్ చేసి జట్టును ఆధిక్యంలో నిలపగా యువ స్ట్రైకర్ దీపికా (20, 57వ ని.) రెండు కీలక గోల్స్ చేసింది. ఆట అర్ధభాగం ముగిసేసరికి 2-0తో భారత్ ఆధిక్యంలో ఉన్నా మూడో క్వార్టర్‌లో దక్షిణ కొరియా నాలుగు నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ చేసి అనూహ్యంగా పుంజుకుంది. యురి లీ (34వ ని.), కెప్టెన్ యున్బి చియోన్ (38వ ని.) చెరో గోల్ చేశారు. ఇక మరో మూడు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా దీపికా 57వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలవడంతో భారత్‌కు విజయం సొంతమైంది.

పాక్ టూర్ అనుమతికి నిరీక్షణ

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌లో అంధుల టీ20 ప్రపంచకప్‌లో ఆడేందుకు భారత జట్టు.. కేంద్ర హోం, విదేశాంగ శాఖల అనుమతి కోసం వేచి చూస్తున్నది. ఈనెల 22 నుంచి మొదలుకానున్న అంధుల టీ20 ప్రపంచకప్‌లో భారత్ ఆడాల్సి ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వ అనుమతి లేనిదే పాక్‌కు వెళ్లలేమని, నిర్ణయం కోసం వేచిచూస్తున్నామని అసోసియేషన్ కార్యదర్శి శైలేందర్ పేర్కొన్నారు.

షమీ పునరాగమనం

కోల్‌కతా: టీమ్‌ఇండియా స్టార్ పేసర్ మహ్మద్ షమీ ఏడాది కాలం తర్వాత ప్రొఫెషనల్ క్రికెట్‌లో పునరాగమనం చేయనున్నాడు. గతేడాది స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో కాలి గాయం తర్వాత ఆటకు దూరమైన షమీ.. రంజీ ట్రోఫీలో భాగంగా బుధవారం మధ్యప్రదేశ్‌తో జరుగబోయే మ్యాచ్‌లో బెంగాల్ తరపున ఆడనున్నాడు. ఈ విషయాన్ని క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ (క్యాబ్) సెక్రటరీ నరేష్ ఓజా ఓ ప్రకటనలో తెలిపాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ముందున్న నేపథ్యంలో షమీ ఈ మ్యాచ్‌లో ఫిట్‌నెస్ నిరూపించుకుని రాణిస్తే అతడిని ఆస్ట్రేలియాకు పంపించే అవకాశాలూ లేకపోలేదు.

లడఖ్‌లో పారా స్పోర్ట్స్ సెంటర్

ఆదిత్య మెహతా ఫౌండేషన్‌తో ఒప్పందం

న్యూఢిల్లీ: పారా స్పోర్ట్స్‌కు దేశంలో ఆదరణ అంతకంతకూ పెరుగుతున్నది. ఇటీవల పారిస్ పారాలింపిక్స్‌లో అథ్లెట్లు అంచనాలకు మించి రాణించిన నేపథ్యంలో మరింత ప్రాధాన్యం లభించింది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతం లేహ్(లడఖ్)లో పారా స్పోర్ట్స్ సెంటర్ ఏర్పాటు కాబోతున్నది. లాస్‌ఏంజిల్(2028) పారాలింపిక్స్ కోసం ఇక్కడ అథ్లెట్లకు అత్యుత్తమ శిక్షణ అందించనున్నారు. లేహ్‌లోని లడఖ్ అటామనాస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎల్‌ఏహెచ్‌డీసీ).. హైదరాబాద్‌కు చెందిన ఆదిత్య మెహతా ఫౌండేషన్(ఏఎమ్‌ఎఫ్) మంగళవారం ఎంవోయూపై సంతకాలు చేశారు. ఈ కేంద్రంలో భారత్‌తో పాటు వివిధ దేశాలకు చెందిన పారా అథ్లెట్లు శిక్షణ పొందనున్నారు. ఇందులో పారా ఆర్చరీ, అథ్లెటిక్స్, వింటర్ గేమ్స్ సహా మొత్తం 20 క్రీడల్లో శిక్షణకే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఏహెచ్‌డీసీ సీఈసీ గైయాల్సన్, ఏఎమ్‌ఎఫ్ ప్రతినిధి ఆదిత్య పాల్గొన్నారు.

ఓటమితో మొదలు

టురిన్ (ఇటలీ): భారత సీనియర్ టెన్నిస్ ప్లేయర్ రోహన్ బోపన్న, ఆస్ట్రేలియా ఆటగాడు మాథ్యూ ఎబ్డెన్ ద్వయం అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) ఫైనల్స్‌ను ఓటమితో ఆరంభించింది. టురిన్‌లో జరుగుతున్న ఈ టోర్నీ గ్రూప్ దశలో భాగంగా మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-ఎబ్డెన్ జోడీ.. 2-6, 3-6తో సిమోన్ బొలెల్లి-ఆండ్రియా వవసురి (ఇటలీ) చేతిలో పరాభవం ఎదుర్కొంది. మ్యాచ్‌లో ఇండో ఆస్ట్రేలియా జంట చేసిన రెండు డబుల్ ఫాల్ట్స్‌కు మూల్యం చెల్లించుకోక తప్పలేదు. ఈ టోర్నీ తర్వాతి మ్యాచ్‌లో వాళ్లిద్దరూ.. బుధవారం మార్సెలో అరెవలో(ఎల్ సాల్వెడర్)-మేట్ పావిస్ (క్రొయేషియా)తో అమీతుమీ తేల్చుకోనున్నారు.

ఢిల్లీ బౌలింగ్ కోచ్‌గా మునాఫ్

న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ కోచ్‌గా భారత మాజీ క్రికెటర్ మునాఫ్ పటేల్ ఎంపికయ్యాడు. రానున్న ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ జట్టుకు మునాఫ్ సేవలందించనున్నాడు. రికీ పాంటింగ్ స్థానంలో కొత్తగా వచ్చిన చీఫ్ కోచ్ హేమాంగ్ బదానీతో కలిసి పటేల్ పనిచేయనున్నాడు. 2018లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఈ 41 ఏండ్ల వెటరన్ బౌలర్ భారత్ 86 మ్యాచ్‌ల్లో 125 వికెట్లు పడగొట్టాడు. దీనికి తోడు 2011లో వన్డే ప్రపంచకప్ గెలిచిన టీమ్‌ఇండియాలో మునాఫ్ సభ్యుడు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.